జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు నిహాల్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోనే తొలిసారిగా రాష్ట్రస్థాయి ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎంపిక పోటీల్లో ఆదిత్య ఆర్చరీ అకాడమీ విద్యార్థి చెటికం నిహాల్ రామ్‌తేజ్ విజేతగా నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈనెల 24న విజయవాడ శాతవాహన కళాశాల వేదికగా జాతీయస్థాయి ఎంపిక పోటీల్లో అండర్-10 ఇండియన్ రౌండ్ విభాగంలో సత్తా చాటిన నిహాల్ ప్రథమ స్థానం దక్కించుకున్నాడు. ఆయన తండ్రి చంద్రమౌళి ఆదిత్య కన్‌స్ట్రక్షన్‌లో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 15మంది పాల్గొన్నారు. వీరిలో బద్రి ప్రసాద్‌తేజ, బలగ భానుప్రసాద్, గుణపర్తి గుణశేఖర్, బాలా మోక్షజ్ఞ ఆదిత్య, కుప్పిలి దేవీచరణ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆదిత్య ఆర్చరీ అకాడమీ డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి రాధిక

మాదకద్రవ్యాలు మానవాళి వినాశకాలు

- యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదు
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాదకద్రవ్యాలు మానవాళి వినాశకాలు అని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యాన స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎస్‌పి జెండా ఊపి బుధవారం ప్రారంభించారు. అనంతరం బాపూజీ కళామందిర్‌లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో మాట్లాడారు. మత్తు పదార్థాలకు యువత బానిస కాకుడదన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. చదువుకునే వయసులో విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలు రవాణా చేయడంతో పాటు నిల్వలు, వినియోగం కూడా నేరమేనన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 55 ఎన్‌డిపిఎస్ కేసులు నమోదు చేశామని తెలిపారు.

యువత చదువుకునే వయసులో ఇలాంటి కేసుల్లో చిక్కుకుంటే ఉద్యోగావకాశాలు కోల్పోతారని చెప్పారు. చిన్న వ్యసనమే జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తుందన్నారు. వ్యసనం అనేది నేర ప్రవృత్తి వైపు మళ్లించి వ్యక్తిని నేరాలు చేసేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. చెడు స్నేహాలు, వ్యసనాలకు దూరంగా ఉండి జీవితంలో ఎంచుకున్న లక్ష్యాల వైపు అడుగులు వేసి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. పూర్తిస్థాయిలో మాదకద్రవ్యాలకు బానిసలైన వారిని కౌన్సెలింగ్ ద్వారా మానసిక నిపుణుల సూచనల మేరకు సామాన్య జీవనం వైపు మళ్లించడం జరుగుతుందన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని సూచించారు. ప్రతిఒక్కరూ సమిష్టిగా మాదకద్రవ్యాల వ్యతిరేకతకు కృషి చేస్తే డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు.

ఎఎస్‌పిలు జి.ప్రేమకాజల్, డి.గంగాధరం మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు లేకున్నా ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమ రవాణా జరుగుతోందన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు, రవాణాపై సమాచారాన్ని ఎస్ఇబి టోల్ ఫ్రీ నంబరు 14405కు అందించాలని కోరారు. అనంతరం మాదకద్రవ్యాల నియంత్రణలో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సందేశాత్మక లఘు చిత్రాల్లో ప్రథమ బహుమతిని శ్రీకాకుళం నగరానికి చెందిన పి.రోహిత్ బృందానికి రూ.ఐదు వేలు, ద్వితీయ బహుమతి రణస్థలంకు చెందిన ఆర్.రమణ బృందానికి రూ.మూడు వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఉమామహేశ్వరరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యాన మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై జోష్ శివ బృందం ఏడురోడ్ల కూడలిలో నిర్వహించిన ఫ్లాష్ మాబ్ వీక్షకులను ఆకట్టుకుంది.

- కాలువ అంతటా పేరుకుపోయిన పూడిక
- శివారు కాలువల్లో హడావుడిగా పనులు
- షార్ట్ టెర్మ్ టెండర్లు పిలవకుండా సర్దుబాటు
- నామినేషన్ పద్ధతిపై టిడిపి కార్యకర్తలకు కట్టబెడుతున్న వైనం

నందిగాం మండలంలో సాగుతున్న జంగిల్ క్లియరెన్స్ కాలువ పనులు

'వంశధార'లో వింతలు

వంశధార అధికారుల్లో వింత పోకడలు కనిపిస్తున్నాయి. కుడి, ఎడమ కాలువల్లో ప్రారంభం నుంచి చివరి వరకు గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది. తొలుత కాలువ ప్రారంభం నుంచి సరిచేసుకుంటూ వస్తే శివారు భూములకు నీరందడం పెద్ద సమస్య కాదు. వంశధార ఇంజినీరింగ్ అధికారులు మాత్రం మొదట శివారు ప్రాంత కాలువల్లో పూడికతీత పనులు మొదలుపెట్టి రివర్స్‌లో వస్తున్నారు. పనులను ఒక పద్ధతి ప్రకారం కాకుండా హడావుడిగా చేపట్టడంపై అనే విమర్శలు వినిపిస్తున్నాయి. టిడిపి కార్యకర్తలకూ ఎంతో కొంత లబ్ధి చేకూరుస్తున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు. ఎడమ కాలువ శివారు ప్రాంతంపై దృష్టిసారించిన అధికారులు, కుడి కాలువ శివారు ప్రాంతాలను విస్మరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందివ్వాల్సి ఉంది. ఎడమ కాలువ 104.5 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కాలువ పరిధిలో జలుమూరు, సారవకోట, నరసన్నపేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో గల 398 గ్రామాల్లోని 1,48,230 ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. కుడి కాలువ 63 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కాలువ పరిధిలో హిరమండలం, ఎల్‌ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార మండలాల్లోని 165 గ్రామాల్లోని 62,280 ఎకరాలకు సాగునీరు చేరాల్సి ఉంది. రెండు కాలువల్లో అడగడుగునా పెద్దఎత్తున గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది. దాన్ని తొలగిస్తే గానీ కాలువల్లో నీరు స్వేచ్ఛగా ప్రవహించే అవకాశం లేదు. తొలగింపు పనులు ప్రారంభ స్థానం నుంచి చేస్తే శివారుకు సాగునీటి సమస్యలు ఉత్పన్నం కావు. కానీ ఎడమ కాలువకు సంబంధించి ఒక్క టెక్కలి డివిజన్ పనులు మొదలుపెట్టి, మిగిలిన ప్రాంతాలను విస్మరించడంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. నిధుల కేటాయింపులోనూ సింహభాగం ఆ డివిజన్‌కే కేటాయించినట్లు తెలుస్తోంది. రెండు కాలువలకు కలిపి రూ.90 లక్షలు కేటాయించగా, టెక్కలి డివిజన్‌లోని నందిగాం, పలాస ప్రాంతాలకు రూ.22 లక్షలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

హడావుడిగా పనులు

టెక్కలి డివిజన్‌కు కేటాయించిన సొమ్ములతో హడావుడిగా పనులు ప్రారంభించేశారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఈనెల 24వ తేదీన నందిగాం, పలాస ప్రాంతాల్లో కాలువల పరిశీలనకు వెళ్లి వచ్చిన మరుసటి రోజే పనులు మొదలుపెట్టేశారు. పనులను అంతా నామినేషన్ పద్ధతిపై కేటాయించినట్లు సమాచారం. పనులకు సంబంధించి రూ.లక్ష లోపు వరకు సంబంధిత ఇఇ అనుమతులు ఇస్తారు. రూ.రెండు లక్షల పనుల వరకు ఎస్ఇ అనుమతి ఇస్తారు. ప్రస్తుత పనులకు షార్ట్ టెర్మ్ టెండర్లను పిలవాల్సి ఉన్నా, పనులన్నింటినీ రూ.రెండు లక్షల్లోపు సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది. టెండర్లను పిలవకుండా నేరుగా నామినేషన్ పద్ధతిన నచ్చిన వారికి కేటాయించినట్లు సమాచారం.

మా పరిధి వరకు మేం పనులు చేస్తున్నాం

వంశధార ఎడమ కాలువకు సంబంధించి మా పరిధిలోని నందిగాం, పలాస ప్రాంతాల్లోని కాలువల్లో గుర్రపుడెక్క, పూడికతీత పనులు చేస్తున్నాం. పనుల కోసం రూ.22 లక్షలు కేటాయించారు. పనులన్నీ రూ.రెండు లక్షల్లోపు పనులే కావడంతో నామినేషన్ పద్ధతిన ఉన్నతాధికారులు కేటాయించారు.

- బి.శేఖర్‌రావు, వంశధార ఇఇ టెక్కలి డివిజన్

కుడి కాలువ శివారు కాలువల పరిస్థితేమిటి?

కుడి కాలువ పరిధిలోని శివారు ప్రాంతమైన గార మండలంలో ప్రతి ఏడాదీ సాగునీరందక పంటలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. కుడి కాలువలోనూ పెద్దఎత్తున గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది. ముఖ్యంగా కాలువ ప్రారంభమయ్యే హిరమండలం, సరుబుజ్జిలి, ఎల్‌ఎన్‌పేట ప్రాంతాల్లో కాలువల్లో అడుగడుగునా గుర్రపుడెక్క ఉండడంతో నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. గుర్రపుడెక్క, పూడిక తీవ్రత ఉన్న ప్రాంతాలపై దృష్టిసారించి, వాటిని తొలగిస్తే నీటి ప్రవాహానికి అడ్డంకి ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈనెల 19వ తేదీన నందిగాం, పలాస ప్రాంతాల్లో పర్యటించి వంశధార కాలువలను పరిశీలించారు. ఆ ప్రాంతాల పరిశీలనకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను ఆదేశించారు. ఆ తర్వాత ఇప్పుడు అక్కడ చకచకా పనులు జరుగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో కాలువల పరిస్థితి మాత్రం అలానే ఉంది. తమ ప్రాంతం, తమ రైతులు అనే దృక్పథం కాకుండా జిల్లావ్యాప్తంగా ఉన్న రైతుల ప్రయోజనాలను చూడాలని అంతా కోరుతున్నారు.

1 నుంచి 'స్టాప్ డయేరియా'

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మీనాక్షి

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జూలై ఒకటి నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని ఆమె ఛాంబరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఈ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రతి గ్రామంలో ఎఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల లోపు వయసున్న పిల్లలను నమోదు చేస్తారన్నారని చెప్పారు. వారికి ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలు అందజేసి చిన్నపిల్లల్లో విరేచనాలు, రాకుండా తీసుకునే జాగ్రత్తలు, నివారణా చర్యలను తల్లిదండ్రులకు వివరిస్తారన్నారు. చేతుల పరిశుభ్రత, తాగేనీరు, తల్లిపాల ప్రాముఖ్యత, భోజనం పెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఇంట్లోని ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా అన్నింటిపైనా మూతలు పెట్టేలా అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, మురుగునీరు నిల్వ లేకుండా గుంతలు పూడ్చేందుకు పంచాయతీ కార్యదర్శులతో సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. డయేరియా ప్రోన్ గ్రామాలను (హై ప్రయారిటీ) గ్రామాలను గుర్తించి వాటికి కొంతమంది పర్యవేక్షకులను మ్యాప్ చేసినట్లు తెలిపారు. ఎఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు సోమవారం, గురువారం పాఠశాలలు... బుధవారం, శనివారం అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పారిశుధ్యం, చేతుల పరిశుభ్రత , ఆహారపు అలవాట్లపై ఆరోగ్య విద్యను అందిస్తారని వివరించారు. ప్రతి పిహెచ్‌సిలో ఒక ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్, జిల్లాలో అన్ని ఆరోగ్యశాఖల నుంచి పది మంది అధికారులతో కూడిన డిస్ట్రిక్ట్ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిఎంహెచ్ఒ కార్యాలయంలో 24 గంటల పాటు సేవలందించేందుకు కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

చివరి ఆయకట్టు వరకూ సాగునీరు

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఖరీఫ్ సీజన్‌లో పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సాగునీటి కాలువల మరమ్మతుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంశధార ప్రాజెక్టు సర్కిల్ కార్యాలయంలో సాగునీటి సరఫరాపై ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార కుడి కాలువల పరిధిలో మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల శివారు ప్రాంతాలకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యలున్న చోట మరమ్మతు పనులు చేపట్టి పూర్తిస్థాయిలో సాగునీరందించాలన్నారు. కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోవడం, వయాడెక్టు వద్ద మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల శ్రీకాకుళం నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో నీరు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు.

గ్రోయిన్లు దెబ్బతినడం వల్ల వాటి ద్వారా నీరందని పరిస్థితి నెలకొందని వివరించారు. ముందుగా చెరువుల్లో నీరు నింపి పూర్తిస్థాయిలో సాగునీరందించే ప్రయత్నం చేయాలని సూచించారు. అందుకోసం సాగునీటి కాలువల మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సమావేశంలో వంశధార ఎస్ఇ బి.రాంబాబు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

'టెట్'లో టాప్ లేపాడు

స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన శేషాద్రినాయుడు

శేషాద్రినాయుడును సన్మానిస్తున్న డిసిపి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పొందూరు

ఎపి టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్ (టెట్) ఫలితాల్లో మండలంలోని తోలాపికి చెందిన అన్నెపు శేషాద్రినాయుడు అద్భుత ప్రతిభను కనబరిచాడు. 150 మార్కులకు గానూ 150 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. బిటెక్ చదివిన శేషాద్రి నాయుడు 2020-22 విద్యా సంవత్సరంలో వమరవల్లిలో డైట్ పూర్తి చేశారు. శేషాద్రినాయుడు తండ్రి ధర్మారావు, తల్లి జగదాంబ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. శేషాద్రినాయుడు స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడలో ఎస్‌అండ్‌ఎస్ సంస్థ బుధవారం నిర్వహించిన అభినందన సభలో డిసిపి కె.శ్రీనివాసరావు శేషాద్రినాయుడును సత్కరించారు.

బిఆర్‌ఎయు ప్రిన్సిపాల్ అనురాధ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయం ఆర్ట్స్, కామర్స్, లా, ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ (ఎఫ్ఎసి)గా వర్శిటీ సోషల్ వర్క్ విభాగానికి చెందిన సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎం.అనురాధ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య బి.అడ్డయ్యకు కొద్ది నెలల కిందట రెక్టార్‌గా ఉద్యోగోన్నతి లభించడంతో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆమెను నియమించారు. ఆమె ఇప్పటివరకు వర్శిటీ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2008లో వర్శిటీలో కెరీర్ ప్రారంభించిన ఆమె, వర్శిటీలో సామాజిక అనుసంధాన కార్యక్రమాల సమన్వయకర్తగా, సెక్యూరిటీ, శానిటేషన్, ట్రాన్స్‌పోర్టు పర్యవేక్షక డీన్‌గా, కాన్ఫిడెన్షియల్ రీవాల్యూయేషన్ పరీక్షల డీన్‌గా గతంలో సేవలందించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com

అక్రమ నిర్మాణంపై ఆగ్రహం

ప్రజాశక్తి - కొత్తూరు

దేవాదాయ శాఖకు చెందిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయ భూమిలో అక్రమ నిర్మాణంపై టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్మాణాన్ని నిలిపివేయించాలని అధికారులను ఆదేశించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మండలంలోని కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 177, 202-2, 202-5లో భూములను బుధవారం పరిశీలించారు. దేవాదాయశాఖకు చెందిన స్థలంలో అక్రమ నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సర్వే నంబరు 202-2లో కొవ్వాడ గోపాల్ దేవాదాయ భూమి 60 సెంట్లను ఆక్రమించినట్లు గుర్తించారు. తన ఐదు సెంట్ల భూమిని గోపాల్ ఆక్రమించారని పొందూరు సరస్వతి సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట తహశీల్దార్ ఎం.వి ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, మండల సర్వేయర్ వెంకటరమణ, సర్వేయర్లు గిరిరాజు, ఎ.తిరుపతిరావు, విఆర్‌ఒలు ఉన్నారు.

'అగ్నిపథ్'ను రద్దు చేయాలి

ధర్నా చేస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - పలాస

దేశ రక్షణను పణంగా పెట్టే అగ్నిపథ్ పథకాన్ని వెంటనే రద్దు చేసి, పాత పద్ధతిలోనే ఆర్మీ రిక్రూట్‌మెంట్ చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వాసుదేవ రావు, కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. దేశ రక్షణ వ్యవస్థను సైతం ప్రైవేటీకరణకు పూనుకోవడం మోడీ ప్రభుత్వానికి చెల్లిందని విమర్శించారు. కేవలం నాలుగేళ్ళ మాత్రమే ఉపయోగించుకుని తర్వాత ఇంటికి పంపి వారికి ఎటువంటి పెన్షన్, ఇతర సదుపాయాల్లేకుండా చేయడం చూస్తుంటే బిజెపికి దేశ రక్షణపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దేశ రక్షణ వ్యవస్థను ప్రైవేటు వారికి అప్పగించరాదని డిమాండ్ చేశారు.అగ్నిపథ్ పథకం ద్వారా వంద మందిని ఆర్మీలోకి తీసుకుంటే, వారిలో 75 మందిని నాలుగేళ్ల తర్వాత బయటకు పంపడం ద్వారా దేశ రక్షణకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తూ జిఒ విడుదల చేయాలని, పాత పద్ధతుల్లోనే ఆర్మీ రిక్రూట్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు వెంకటరావు, వల్లభరావు, గుణశేఖర్, సుందరరావు, చందు, సాయి తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తుపై అధికారులను అడిగి తెలుసుకుని, దిశానిర్దేశం చేశారు. నాటుసారా, గంజాయి వంటి మాదకద్రవ్యాలు క్రయ, విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రణాళిక మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి చట్టప్రకారం బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. బాధితులు, ఫిర్యాదుదారులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి శ్రుతి, సిఐ దివాకర్, ఎస్ఐ బి.నిహార్ పాల్గొన్నారు.

NOTICE TO SHOW CAUSE WHY EXECUTION SHOULD NOT BE ISSUE (O. 21, R.22)
IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
E.P.No:3/2024 in O.S.No:205/2018.

Between:
Peesa Narasimhulu ---D.Hr/ Plaintiff
And:
Dale Mangathayaru ---J.Dr./ Defendant
To,
Dale Mangathayaru, W/o Apparao, R/at Gandhi Nagar, Narasannapeta (V & M), Srikakulam District.

Take notice that the above execution Petition is posted for your notice and that you are hereby appear before the Honourable Court of the PRINICIPAL SENIOR CIVIL JUDGE, Srikakulam on **02-07-2024 at 10-30 A.M** personally or through Advocate. If you fails to appear the matter will be decide exparte.

// BY ORDER OF THE COURT //

VULLAKULA KRISHNA RAO
BHASKARA RAO GANGULA
ADVOCATE FOR THE D.HR,
SRIKAKULAM,
PH.NO: 8309502074.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
S.O.P.No: 07/2024

Between:
Pasupureddy Sujathadevi ...Petitioner.
And:
1. Pasupureddy Naga Bhaskara Nirmal Kumar
2. Kandukuri Matha Sharmila
3. Pasupureddy Kalpana ...Respondents.

PUBLIC NOTICE

నాక్లయింట్ అయిన **పసుపురెడ్డి సుజాతదేవి** W/o లేటు పసుపురెడ్డి షణ్ముఖరావు, R/at డోర్ నెం: 4-101, ప్లాట్ నెం: 28, విశాఖ బి కోలనీ, శ్రీకాకుళం టౌన్ మరియు జిల్లా. ఇచ్చిన బోగట్టుపై యావన్మందికి తెలియజేయనది ఏయనగా నా క్లయింట్ పై రెస్పాండెంట్లుపై తన భర్త పసుపురెడ్డి షణ్ముఖరావు గారు రిలయన్స్ నిప్పాన్ కంపెనీ లిమిటెడ్ శ్రీకాకుళం బ్రాంచ్‌లో నాలుగు పాలసీలకు కట్టిన ఇన్‌స్టాల్‌మెంట్ సొమ్ము రూ॥ 17,20,000/- లు రావలసినందున తన పేరున **succession certificate** జారీ చేయవలసిందిగా సదరు **Honourable Court** జారీ చేయవలసిందిగా సదరు **Honourable Court**లో **S.O.P No:7/2024** దాఖలు చేసియున్నారు. రెస్పాండెట్లుకు గానీ ఇంకా ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు వున్నచో తేది **22-07-2024** ఉ॥ **10:30 గం॥లకు** మీరు స్వయంగా లేదా ప్లీడర్ ద్వారా గానీ హాజరై తెలియపర్చవలేను.

యెరుకోల మురళీ మోహన్‌రావు
న్యాయవాది, శ్రీకాకుళం.

ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- పలాస

రైతుల ఆదీనంలో ఉన్న భూములను టిడ్కో ఇల్లు నిర్మాణం కోసం బొడ్డపాడు రెవెన్యూ పరిధి 66, 67 సర్వే నెంబర్‌లో 22 ఎకరాలు తీసుకున్నారని, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించేలా కృషి చేయాలని బొడ్డపాడు రైతులు కోరారు. పలాస టిడిపి కార్యాలయంలో బుధవారం బాధిత బొడ్డపాడు రైతులు ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లిస్తామని హామీఇచ్చి ఏళ్లు గడుస్తున్నా నష్టపరిహారం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న టౌన్ షిప్ నిర్మాణం కోసం బొడ్డపాడు, రావిటి భూములు 150 ఎకరాలను రైతులు నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిందని, ఆ భూముల కొనుగోలుపై గత ప్రభుత్వం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఆయన అనుచరులు అవకతవకలకు పాల్పడ్డారని, ఆ భూములపై సమగ్రమైన విదారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బొడ్డపాడు గ్రామం నుంచి జాతీయ రహదారి వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, బొడ్డపాడు యువజన సంఘం నాయకులు తామడ క్రాంతి, బొడ్డుపాడు యువజన సంఘం సభ్యులు బొడ్డు సింహాద్రి, తామాడ రామారావు, బొడ్డు మోహనరావు, బొడ్డు జగన్, నౌగాపు గంగాధర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి మహానంది అవార్డు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కృష్ణారెడ్డి

తెలుగు వెలుగు సాహితివేదిక జాతీయ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మాజీ భారత ప్రధాని భారతరత్న పి.వి.నరసింహారావు జయంతి 2024 పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మహానంది జాతీయ పురస్కారానికి ఇచ్చాపురానికి చెందిన శాస్త్రీయ సంగీత కళా రంగంలో చేస్తున్న ఆశీ కృష్ణారెడ్డి ఎంపికయ్యారని తెలుగు వెలుగు సాహితి వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వలబోజు మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ హోదాల్లో సామాజిక, సాంఘిక శాస్త్రీయ సంగీతం విద్యా సేవా కార్యక్రమంతో పాటు తెలుగు వెలుగు భాషాభివృద్ధికి తోడ్పడుతున్న సందర్భంగా ఈయనను ఎంపిక చేసినట్టు వారు తెలిపారు. ఈనెల 30న తెలంగాణలోని కరీంనగర్‌లో జరిగే కార్యక్రమంలో అతిధుల చేతులమీదుగా కృష్ణారెడ్డికి పురస్కారం ప్రధానం చేయనున్నట్లు వారు తెలిపారు. కృష్ణారెడ్డి మహానంది పురస్కారానికి ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలలదే హవా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లాలోని 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 2454 మంది విద్యార్థులకు గానూ 2,371 మంది పరీక్షలు రాశారు. వీరిలో 1004 మంది పాస్ అయ్యారు. సరాసరిగా జిల్లాలో 42.35 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీరిలో సారవకోట జూనియర్ కళాశాలలో 32 మంది పరీక్షలు రాయగా శతశాతం మంది పాస్ అయ్యారు. కింతలిలో 40 మందికి 38 మందినందిగాంలో 42కు 36 మంది, లావేరులో 38 మందికి 30 మంది, ఆముదాలవలసలో 72మంది పరీక్షలు రాయగా 53 మంది పాసైయ్యారు. కోయ్యాంలో 58 మందికి 36 మంది పాస్ కాగా, జి. సిగడాంలో 92 మందికి 66 మంది, మందసలో 47 మందికి 33మంది, కవిటిలో 54కు 37 మంది పాసయ్యారు. ఇచ్ఛాపురంలో 55 మంది పరీక్షలు రాస్తే నలుగురే పాసయ్యారు. నివగాంలో 29 మదికి గాను ముగ్గురు పాసయ్యారు. పాతపట్నంలో 128 మందికి 23 మందిపాస్ కాగా ,శ్రీకాకుళంలో 224 మందికి 45 మంది ఎల్ ఎన్ పేటలో 35మందికి 8 మందిపాసయ్యారు. నరసన్నపేట జూనియర్ కళాశాలలో స్వల్పంగా పాసైయ్యారు. ఇక్కడ 74 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 23 మంది మాత్రం పాస్ కాగా, సోంపేటలో 52 మందికి 17 మంది, కొత్తూరు కళాశాలలో 83 మందికి గాను 28 మంది పాస్ అయ్యారు. జిల్లాలోని 22 కేజీబీవీలలో 218 మంది పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 216 మంది హాజరు కాగా 156 మంది పాసైయ్యారు. అంటే 72.22 శాతం ఉత్తీర్ణులయ్యారు. 14 మోడల్ స్కూల్స్‌లో 369 మంది పరీక్షలు రాయగా 199 మంది పాసయ్యారు. ఇక్కడ 53.93 శాతం సాధించారు. ప్రైవేటు అన్ ఎయిడెడ్ కళాశాలు71 ఉండగా 3,862 మందికి గానూ 3,703 మంది పరీక్షలు రాయగా 1487 మంది ఉత్తీర్ణులయ్యారు. శ్రీరామ జూనియర్ కళాశాల, శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాలలో అయితే జీరో శాతం ఫలితం సాధించారు.

చెక్కును అందజేస్తున్న పోలీసు అసోసియేషన్ ప్రతినిధులు

ఎఎస్ఐ కుటుంబానికి రూ.లక్ష సాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని క్రైం పోలీసుస్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేస్తున్న ఎఎస్ఐ నక్క వెంకటరమణ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న జిల్లా పోలీసు అషోషియేషన్ ప్రతినిధులు బుధవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఎస్‌పి రాధిక ఆదేశాల మేరకు తక్షణసాయంగా ఆయన భార్య, కుమారుడు వెంకటేష్‌ను కలిసి ఓదార్చిన అనంతరం డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు రోణంకి కృష్ణంనాయుడు, కోశాధికారి భుజంగరావు, రాష్ట్ర అసోసియేషన్ సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ అరుణ కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు జగదాంబ, మాజీ అధ్యక్షుడు కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాది కల్పించే లక్ష్యంతో ఉపాది కల్పనా శాఖ ఆధ్వర్యాన ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్న జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఐటిఐ కేంద్రంలో ఈ ఎంపికలు జరగనున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 కంపెనీలు ఈఎంపికల్లో నియామకాలు చేపడతారని తెలిపారు. విద్యార్హతల ఆధారంగా నియామకాలు జరగనున్నట్టు తెలిపారు. దరఖాస్తుదారులు ముందుగా డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.ఎంప్లాయిమెంటు.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగ పరచుకోవాలన్నారు.

పైనాపిల్ ఉత్పత్తులపై శిక్షణ

ఆమదాలవలస: పైనాపిల్ ఉత్పత్తులపై గిరిజన యువతీ యువకులకు కృషి విజ్ఞాన కేంద్రంలో రెండో రోజు గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పైనాపిల్‌తో పైనాపిల్ క్యాండిని తయారు చేయడంపై శిక్షణను ఇచ్చారు. అనంతరం బాటిల్స్ జామ్, స్క్వాష్ ను ప్యాకింగ్ చేయడం, లేబులింగ్ ఫుడ్ రిజిస్ట్రేషన్ ఏ విధంగా చేయించాలి తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, గిరిజన యువతీ, యువకులు, వెలుగు అసోసియేషన్ ఏరియా కో-ఆర్డినేటర్ ఎస్.ఆనంద్, వసంత, శంకర్ పాల్గొన్నారు.

'మత్తు'తో యువత జీవితాలు చిత్తు

పొందూరు : మానవహారం చేపడుతున్న విద్యార్థులు, అంగన్వాడీలు

ప్రజాశక్తి- పలాస

ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి రహిత ఆంధ్రాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం కాశీబుగ్గ పోలీసుల అధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే ముందుగా యాంటీ డ్రగ్ పాటను ఆవిష్కరించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లలో గత ప్రభుత్వం గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని, టీకొట్టు నుంచి పాన్‌షాపు వరకు ప్రతీ దగ్గర గంజాయి విచ్చలవిడిగా విక్రయాలు సాగించారన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ పట్టుబడితే దాని మూలాలు ఆంధ్రాలోనే ఉంటున్నాయన్నారు. పోలీసులు గంజాయి విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన ర్యాలీకి ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, కాశీబుగ్గ డిఎస్‌పి డి.నాగేశ్వరరెడ్డి, సిఐ కె.విజయానంద్, ఎస్ఐబి ఎస్ఐ గిరిబాబు, పాఠశాల హెచ్ఎం కె.దాశరథి, పోలీస్ సిబ్బంది, పిఇటి తవిటయ్య, టిడిపి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం: మత్తు పదార్థాలు సేవిస్తే జీవితం చిత్తవుతుందని ఎస్ఐబి సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవిప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, మహిళా ఎస్ఐ పి.నాగలక్ష్మి, జగదీష్ బాబు, ఖుద్దుస్, శివాజీ, గణేష్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కవిటి: మాదక ద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై ఉక్కు పాదం మోపాలని ఎస్ఐ కె.రాము అన్నారు. స్థానిక ఎస్‌విజె, బడగల శంకరరావు కళాశాల, కల్యాణి కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌విజె ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, పి.సత్యనారాయణ, జల్లు సుబ్బారావు, ముకుందరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మాదక ద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి మల్ల తెలిపారు. టెక్కలి ఔషధ నియంత్రణ అధికారి కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాదినోత్సవాన్ని పురష్కరించుకొని స్థానిక మందుల షాపుల యజమానులతో ఆయన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వెల వివేకనందు, మందులషాపు యజమానులు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.రాణి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. వేణుగోపాలరావు అధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులు పురవీధుల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఫ్లకార్డులతో నినాదాలు చేపట్టారు. అనంతరం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి, స్పెషల్ ఎన్‌ఫోర్స్మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రావణి, న్యాయవాదులు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మత్తు పదార్థాలతో జీవితాన్ని చిత్తు చేసుకోవద్దని సిఐ టి.ఇమ్మన్యుయల్ రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులతో పురవీధుల్లో భారీర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీలో జ్ఞానభారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహర్ ఖాన్, రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు, ట్రస్టీ రమణమూర్తి, ఐ.బి.పండా తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మాదక ద్రవ్యాల వ్యవతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఐబి ఎస్ఐ ఇ.రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కూడలిలో మానవహారం చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. స్థానిక పోలీస్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవ సంఘం అధ్వర్యంలో వంశధార విద్యాసంస్థల విద్యార్థులకు జూనియర్ సివిల్ జడ్జి బిఎంఆర్ ప్రసన్నలత అవగాహన సదస్సు, న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాధుల సంఘం అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాది వెలమల అప్పల నాయుడు, కళాశాల డైరెక్టర్ సి హెచ్. అనిరుద్ధుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతపట్నం: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ మహమ్మద్ యాసిన్ అన్నారు. స్థానిక మహేంద్ర డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులతో మెయిన్ రోడ్‌లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పోలీస్ సిబ్బంది, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మాదకద్రవ్యాల వ్యతిరేక నిరోధక దినోత్సవ సందర్భంగా పూండీలో ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో విద్యార్థులు పోలీసులు ర్యాలీ చేపట్టి మానవహారం నిర్వహించారు.

ఆమదాలవలస: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సీఐ వివేక్ యాదవ్ అన్నారు. పట్టణంలోని సిద్దార్థ ఐటిఐలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సిద్దార్థ ఐటిఐ నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐబి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రాజారావు, సబ్ ఇన్‌స్పెక్టర్లు కరుణ లత, నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పలాస : సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి తేజ చక్రవర్తి

సోంపేట: స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డు మీదుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండ్ కూడలి వద్ద మానవహారం చేపట్టారు. కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్‌రెడ్డి, సిఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ హైమావతి, ఎస్ఐబి ఇన్‌స్పెక్టర్ జై భీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మాదక ద్రవ్యాలతో బాల్యం ఛిద్రం అవుతోందని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ప్రకటనలో తెలిపారు. ప్రపంచ మాదక ద్రవ్యాల విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలను చైతన్య వంతులుగా తీర్చిదిద్దాలని కోరారు.

మెళియాపుట్టి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం యువత చేసిన పలు లఘు చిత్రాల ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఇఒ పద్మనాభరావు, మహిళా పోలీస్ భారతి, స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి గ్రీష్మ, హెచ్ఎం గణపతిరావు, ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

ప్రజాశక్తి- పాతపట్నం

మండలానికి చెందిన ప్రహరాజపాలెం గ్రామ ఫుట్‌బాల్ క్రీడాకారుడు కిరీటం సీతయ్య ఈనెల 29, 30 తేదీల్లో పూణేలో జరగబోయే ఫుడ్‌బాల్ నేషనల్ రగ్బీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపికయ్యాడు. ఆయన నిరుపేద కుటుంబ పరిస్థితి వలన స్థానికులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి బుధవారం రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సుజాత

ప్రజాశక్తి- పొందూరు

సుజాత

ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సూపరి ంటెండెంట (డిడిఒ) గా డాక్టర్ పేడాడ సుజాత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సూప రింటెండెంట్ బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ రామదాస్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించి వైద్యాధికారులు సుజాతకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం డాక్టర్ సుజాత పొందూరు ప్రభుత్వ ఆస్పత్రిలోనే గైనకాలజిస్టుగా పనిచేస్తున్నారు.

చదువుపై శ్రద్ధ చూపాలి

బూర్జ: విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపాలని ఎంపిపి కర్నెన దీప అన్నారు. బుధవారం మండలంలోని పాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులు ఎటువంటి వ్యసనాలకు చెడు స్నేహాలకు పోకుండా చదువు పట్ల ఆసక్తితో ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జెడ్‌పిటిసి రామారావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వి.సీతారాం బాబు నాయుడు, హనుమంతు గోవింద రాజులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మొక్కలు నాటాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జిల్లా అధికారులు ఇచ్చిన లక్ష్యాల మేరకు మండల వ్యాప్తంగా 300 ఎకరాల్లో సుమారు 8వేల మొక్కలు నాటాలని టెక్కలి ఎపిడి శైలజ అన్నారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. రోడ్లకు ఇరువైపుల, ప్రభుత్వ భవనాల వద్ద మొక్కలు నాటడానికి ప్రణాళిక వేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో పనులు జరగాలని ఫారం పాండ్స్ పనులువేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ రవి, ఇసి ఆదినారాయణ రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వరి విత్తనాలు పంపిణీ

సంతబొమ్మాళి: బోరుభద్ర సచివాలయంలో వరి విత్తనాలను టిడిపి కార్యకర్తలు ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. వజ్జ ప్రభాకరరావు, అప్పిని వెంకటేష్, వల్లభ వసంత్, రామారావు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ మోహిని, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చౌడు నేలలకు అనుకూలం

నందిగాం: చౌడు నేలలు గల రైతులు సిఆర్ 412, సిఆర్ 414 రకాలు అనువైనవిగా గుర్తించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు కిరణ్ గాంధీ, కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని పాలవలసలో ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులతో షెడ్యూల్డ్ కులాల వారికి ఉచితంగా వరి విత్తనాలను టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్ కుమార్, ఎం.బాలకృష్ణ, సబ్బి జానకిరామ్‌తో పాటు సర్పంచ్ సన్యాసిరావులు పంపిణీ చేపట్టారు. ఈ రకాలు చీడపీడలను తట్టుకుంటాయని, అధిక దిగుబడి పొందవచ్చునని శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ వర్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి- రణస్థలం

గ్రామంలో పారిశుద్ధ్యం, రక్షిత తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వర్లు సూచించారు. కోష్ట పంచాయతీ పల్లెపేటలో పారిశుద్ధ్య పనులను డిపిఒ, ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, ఇఒపిఆర్‌డి ఎ.ప్రభాకరరావు బుధవారం ఆకస్మిక పరిశీలన చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే మురుగు, వ్యర్థాలు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం కార్యదర్శి ఆర్.శ్రీధర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.రామునాయుడుతో మాట్లాడారు. తాగునీటి బావులు, కొళాయిల వద్ద ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చేయించాలని సూచించారు. గ్రామంలో పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, పంచాయతీలో మందుల కొరత లేకుండా జాగ్రత్త వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ పనులను టిడిపి నాయకులు పిషిని జగన్నాధం నాయుడు, ఎంపిటిసి అసిరినాయుడు, మాజీ ఎంపిటిసి పైడి అప్పుడు దొర, సర్పంచ్ పిసిని హరిబాబు పర్యవేక్షిస్తున్నారు. సచివాలయ, అంగన్వాడీ, ఆశ, పారిశుద్ధ్య కార్మికులు, యువకులు పాల్గొన్నారు.

రణస్థలం : పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

కవిటి: పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా పంచాయతీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్టు దుగానపుట్టుగ సర్పంచ్ డి.భద్రాచలం అన్నారు. పంచాయతీలో మంచినీటి ట్యాంకులు బ్లీచింగ్‌తో శుభ్రం చేసి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ళపొదలు బుధవారం తొలగించారు. అదే విధంగా పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి చిన్నారి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

యాంత్రీకరణతో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. నీలవేణి అన్నారు. జిల్లాలో ఖరీఫ్ పంట కాలంలో వరి ప్రధానమైన పంటని ఈ వరి పంటను సుమారుగా 1,50,000 ఎకరాల్లో సాగు చేస్తున్నారని, దీనిలో 50 నుంచి 60 శాతం వరకు రైతులు వెద పద్ధతిలో సాగు చేయడం ఆనవాయితీ అన్నారు. ఖర్చులు పెరగడం, కూలీలు సకాలంలో అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో రైతులు నారు పెంచి నాటే విధానానికి బదులు ఈ వెద పద్ధతిలో విత్తనం, ఎరువును ఒకేసారి వేసే యంత్రంతో వేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎరువు, విత్తనం ఒకేసారి వేయు యంత్రంతో ప్రదర్శన క్షేత్రాన్ని నిర్వహించారు. దీనివలన సాగు ఖర్చులు తగ్గటమే కాకుండా అధిక దిగుబడులు కూడా సాధించవచ్చునని తెలిపారు. ఇలా నేరుగా యంత్రంతో విత్తినప్పుడు విత్తన మోతాదు 50శాతం వరకు తగ్గుతుందని, పంట పడిపోదని, నీటిని ఆదా చేసుకోవచ్చునని తెలిపారు. యంత్రాలతో సులువుగా కోతకోయవచ్చునని, పంట ఏడు నుంచి పది రోజులు ముందుగా కోతకు వస్తుందని తెలిపారు. చీడపీడల సమస్య కూడా తగ్గుతుందన్నారు. నేరుగా విత్తె వరికి అనుకూలమైన (ఎంటియు 1061, ఎంటియు 1064, ఎంటియు 1121, ఎంటియు 1224, ఎంటియు 7029) వరి రకాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, డాక్టర్ ఎస్.అనూష, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్ అనంత్, రైతులు హాజరయ్యారు.

బూర్జ: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొల్లివలస గ్రామ రైతు సైరిగాపు ఆనందరావు ఎరుపులు, విత్తనం ఒకేసారి వేసే (ఫెర్టి కమ్‌సీడ్ డ్రిల్) యంత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఏరియా మేనేజర్ మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితులలో వర్షాధారంగా లభిస్తున్న తక్కువ నీటితో లాభదాయక దిగుబడులు సాధించాలంటే వరి సాగును యంత్రాలతో చేయవలసిన అవశ్యకత ఏర్పడిందని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త డి.యేసు, దుర్గారావు, గణేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఇఆర్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎచ్చెర్ల నియోజకవర్గం ఎమ్మెల్యేగా నడుకుదిటి ఈశ్వరరావు ఎన్నికైన తరువాత అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా నియోజకవర్గానికి అడుగుపెట్టిన తరుణంలో కూటమి నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున విశాఖపట్నం విమానాశ్రయంకు చేరుకొని ఘనస్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయం నుంచి తన స్వగ్రామమైన నడుకుదిటిపాలెం వరకు కుటమి నాయకులు ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రామతీర్థాలు కూడలి వద్ద ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ప్రధానంగా సాగునీరు, తాగునీరు, రహదారులు అభివృద్ధికి కృషి చేస్తానని అదేవిధంగా స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో ఉపాధి కల్పించడానికి ప్రథమంగా ప్రాధాన్యత ఇస్తానని ప్రకటించారు. అనంతరం ప్రజల హర్షద్వానాల మధ్య ఊరేగింపు ఘనంగా జరిగింది. కార్యక్రమంలో నాలుగు మండలాల కూటమి నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్ఇఆర్

క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- పలాస

మండలం తాళ్లబద్ర రైల్వేగేట్ సమీపంలో కిలోమీటర్ దూరంలో షాలిమార్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న షాలీమర్ రైలు నుంచి జారీపడి అస్సాంకు చెందిన ఇంద్ర బహదూర్ బోరో అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తోటి ప్రయాణికులు రైల్వే అధికారులకు సమాచారం అందించడంతో పలాస 108 సిబ్బంది తారకేశ్వరరావు, పైలట్ కెల్లి శ్రీనివాసరావు ఘటనాస్థలానికి చేరుకుని రక్తపు మడుగులో ఉన్న క్షతగాత్రునికి ప్రాథమిక చికిత్స అందించి పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పలాస జీఆర్‌పి పోలీసులు తెలిపారు.

104 ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- కొత్తూరు

104 ఉద్యోగుల జిల్లా కమిటీ పిలుపు మేరకు సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేయాలని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావుకు 104 ఉద్యోగులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గోవిందరావు ద్వారా ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళ్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో జనరల్ సెక్రటరీ డి.కిరణ్, పల్గునరావు ఉన్నారు.

రవికుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు జాతీయ యాదవ మహాసంఘం తరపున ఘన సన్మానం నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో జెవైఎంఎస్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు కడియం అశోకరత్న ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలోనే యాదవులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. దానికి నిదర్శనం ఇటీవలే గాజువాక నుంచి గెలుపొందిన పల్లా శ్రీనివాసరావుకు టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవి కేటాయించడమేనన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ కరగాన సంతోష్ యాదవ్, జిల్లా యూత్ ప్రెసిడెంట్ నాగళ్ల మురళీధర్ యాదవ్, నగేష్ యాదవ్, ఈదు పాపారావు యాదవ్, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రాజు

గ్రామ స్వరాజ్యం వచ్చింది

ప్రజాశక్తి- ఆమదాలవలస

పల్లెల్లో గ్రామ స్వరాజ్యం వచ్చిందని కనుగులవలస సర్పంచ్ నూక రాజు అన్నారు. బుధవారం మండలంలోని కనుగులవలసలో సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వ హయంలో పంచాయతీ నిధులు దారి మళ్లించి గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడిచి అంధకారంలోకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీకి ఐదు లక్షలు మంజూరయ్యాయన్నారు. దీంతో గ్రామంలో పెద్దఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చేది వర్షాకాలమని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

రక్తదాత.. ప్రదీప్ బెజ్జో

కవిటి: తలతంపరకు చెందిన ఓ మహిళ సోంపేటలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఆరోగ్యం కుదుటపడటానికి అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమయానికి ఆ గ్రూపు రక్తం అందుబాటులోకి రాలేదు. దీంతో విషయం తెలుసుకున్న అన్నవరం హెల్పింగ్ హెండ్స్ సభ్యుడు బెజ్జో ప్రదీప్ తానున్నానంటూ ముందుకు వచ్చాడు. ఆ మహిళకు రక్తం దానం చేసి ఆదుకున్నాడు. అయితే ప్రదీప్ రక్తదానం చేయడం ఇది 18వ సారి. 18 సార్లు రక్తదానం చేసిన ప్రదీప్ నేటి యువతకు ఆదర్శప్రాయుడు.

ఆదర్శనీయుడు సత్యనారాయణ మాస్టారు

ప్రజాశక్తి- సోంపేట

సత్యనారాయణ మాస్టారు

ఉద్యోగం అంటే విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు వచ్చిన ఒక మంచి అవకాశంగా భావించి జీవితాంతం వారి అభివృద్ధికి తన బోధనను అంకితం చేసిన ఉపాధ్యాయుడు మట్ట సత్యనారాయణ జీవితం అందరికీ ఆదర్శమని వక్తలు కొనియాడారు. ఈ నెల 30న సుదీర్ఘంగా 35 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తికి ఉద్యోగ విరమణ చేస్తున్న మాస్టారు జీవితంలో ముఖ్యమైన ఘట్టాలు నేటితరం ఉపాధ్యాయులకు మార్గదర్శకం కావాలని పలువురు వ్యాఖ్యానించారు.

విద్యాభ్యాసం

1962 జూన్ 7న మందస మండలం అంబుగాంకు చెందిన మట్ట రామయ్య, శాంతమ్మ దంపతులకు ఏకైక సంతానం. తండ్రి వ్యవసాయ వృత్తిని చేపట్టారు. మాస్టారు 1 నుంచి 5 వరకు సొంత గ్రామంలో చదివి తరువాత 6 నుంచి 10వ తరగతి వరకు జిఆర్‌పురం హైస్కూల్‌లో, ఇంటర్మీడియేట్ గవర్నమెంట్ కాలేజ్‌లో, బారువ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. బిఇడి గురజాడ ఎడ్యుకేషన్ సొసైటీలో పూర్తి చేశారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో ప్రైవేట్‌గా ఎంఎ తెలుగు పూర్తి చేశారు. మొదటిసారిగా 1989 సెప్టెంబర్ నెలలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సిలగాం గ్రామం కవిటి మండలంలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. తరువాత అదే మండలంలో రామయ్యపుట్టుగ స్కూల్‌లో, శివాజీ నగర్ సోంపేటలో పని చేసారు. 2012లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాలవలస స్కూల్‌కు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. 2018లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాణిక్యపురానికి బదిలీ అయ్యి ప్రస్తుతం అక్కడే విధులు నిర్వహిస్తూ జూన్ 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

అవార్డులు

మాస్టారు ప్రతిభను గుర్తించి ప్రభుత్వం 2006లో మండలస్థాయిలో మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చారు. 2016లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

ప్రవృత్తి

ఆట వెలదిలో శతకం వ్రాశారు. తేటగీతి, ద్విపద, స్కంద పద్యాలు, సీస పద్యాలు రచించారు. ఈయనను కవిగా గుర్తించి ఎన్నో సన్మానాలు చేశారు.

కుటుంబ నేపథ్యం

1991లో రమణమ్మతో వివాహం జరిగింది. ఈయనకు ఇద్దరు పిల్లలు. కుమారుడు రాజీవ్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. కుమార్తె సంధ్యారాణి గృహిణి, అల్లుడు అజిత్ కుమార్ వ్యాపారం చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిని ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా సంతోషంగా గడిపినప్పటికీ 2019లో ఈయన భార్య అనారోగ్యంతో మరణించటం ఆయనకు తీరనిలోటును కలిగించింది.

పాతపట్నంలో భారీ వర్షం

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలో బుధవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల పాటు కుండపోతగా భారీ వర్షం కురిసింది. దీంతో విత్తనాలు వేసే రైతులకు మంచిగా ఉపయోగపడుతుందని పలువురు రైతులు తెలిపారు. ఉక్కపోతతో విసిగిపోతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనాన్ని కలిగించిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి- పొందూరు

గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలకు, చిన్నారులకు, గర్భిణులకు అవగాహన కల్పించాలని సూపర్‌వైజర్ జి.వి.రత్నం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పొందూరు సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం డయేరియా, డెంగీ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలని, కేంద్రాల్లో సమయపాలన పాటించాలని, రికార్డుల నిర్వాహణ సక్రమంగా జరపాలని కార్యకర్తలకు ఆదేశించారు.

ట్రూ హ్యాండ్స్ చేయూత

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని పెద్ద అంపురం గ్రామానికి చెందిన ఎదూరి నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కంచిలికి చెందిన ట్రూ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ నర్తు కృష్ణంరాజు బుధవారం నారాయణ కుటుంబానికి సంస్థ తరఫున చేయూత అందించారు. రూ.10వేలు ఆర్థికసాయంతో పాటు నారాయణ పిల్లలు ఇద్దరికీ పదో తరగతి వరకు చదువుకునేందుకు అవసరమైన పుస్తకాలను సంస్థ తరఫున అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలతో పాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన రాఘవులును స్థానిక సిబ్బంది బుధవారం దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్టర్ కె.మన్మధరావు, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ నరేష్ కుమార్, ఇన్‌ఛార్జి రిజిస్టర్ సూర్యనారాయణ రెడ్డి, డాక్యుమెంట్ రైటర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స పెట్టెల ఏర్పాటు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జెసిఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాలుగు చోట్ల ప్రథమ చికిత్స బాక్స్‌లు ఏర్పాటు చేశారు. స్థానిక సేచ్ఛావతి అమ్మవారి ఆలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విద్యుత్‌శాఖ కార్యాలయ ఆవరణం, రవీంద్ర భారతి విద్యా సంస్థలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెసిఐ అధ్యక్షులు షణ్ముఖరావు, పవణ్ కుమార్, ఢిల్లేసు, స్వరూప్ కుమార్, డి.మధు పాల్గొన్నారు.

కళింగ సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా లీల

శ్రీకాకుళం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సేవా సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలిగా బొడ్డేపల్లి లీల నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు సీపాన వెంకటరమణ ఆమెను బుధవారం నియమించారని ఆ సంఘం మీడియా కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు తెలిపారు. తనను మహిళా అధ్యక్షురాలిగా నియమించిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కళింగ సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆమె తెలిపారు.

చురుగ్గా బస్సు షెల్టర్ నిర్మాణం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో పురుషోత్తమపురం గ్రామం వద్ద రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బస్ షెల్టర్ నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు రూ. 2 లక్షలతో బస్ షెల్టర్ నిర్మాణం పూర్తికావస్తోంది. ఈ బస్‌షెల్టర్ జూలై మొదటి వారంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అసిస్టెంట్ గవర్నర్ పి.దినేష్, ప్రెసిడెంట్ రోహిత్, సెక్రటరీ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రాజెక్టు చైర్మెన్‌గా పి.తులసీదాసు పర్యవేక్షణలో చురుగ్గా పనులు జరుగుతున్నాయి.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

కోటబొమ్మాళి: బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని, బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్‌వి ప్రతాప్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బి.సి కోలనీ) ఉపాధ్యాయులు, స్థానిక కెజిబివి పాఠశాల ఉపాధ్యాయులు, ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరూ బడుల్లోనే ఉండాలని, డ్రాపౌట్ పిల్లలను తిరిగి స్కూళ్లలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హెచ్.ఆనందరావు, కెజిబివి ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రశాంతి, సిఆర్‌యంటిలు, పిఐటిలు, పేరెంట్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆమదాలవలస: బడిఈడు పిల్లలు బడిలో చదవాలని ఎమ్మార్సీ సిబ్బంది బొడ్డేపల్లి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని గేటులో సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మనం బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్సీ సిబ్బంది సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా బడికి వెళ్లని ఇద్దరు విద్యార్థులను గుర్తించి సమీపంలో ఉన్న పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో పి. శ్రీధర్, పి. ముత్యాలరావు, బి. వరహాల నాయుడు, సిహెచ్ శైలజ, కె.జ్యోతి, డి.ధనలక్ష్మి, ఎం.రమణ, పి .మల్లేశ్వరి, శేఖర్ పాల్గొన్నారు.

మానసిక ఆనందంతోనే అందం

బ్యూటీషియన్లను సత్కరిస్తున్న పద్మావతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మానసిక ఆనందాన్ని పెంపొందించడం ద్వారానే అందాన్ని పెంచుకునేందుకు వీలవుతుందని, నేటి ఆధునిక కాలంలో ఒత్తిళ్ల కారణంగా ఎక్కువ శాతం మంది తమ అందాల్ని ఆస్వాదించలేక పోతున్నారని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని హోటల్ గ్రాండ్‌లో బుధవారం ఇంటర్నేషనల్ బ్యూటిషియన్ డే వేడుకలను స్టార్ బ్యూటీస్ గ్రూప్ అడ్మిన్, ప్రముఖ బ్యుటిషియన్ ప్రిస్కిల్లా గిరిరాజ్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ వేడుకల్లో అతిథులు ప్రముఖ న్యాయవాది ఎం.సత్యనారాయణతో పాటు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవి పద్మావతి హాజరై మాట్లాడారు. ముఖాలను అందంగా తీర్చిదిద్దడమే బ్యూటీషియన్ల లక్ష్యం కాదని, ప్రతి ఒక్కరిలోనూ మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే లక్ష్యం కావాలన్నారు. బ్యుటిషియన్ కోర్సుల పట్ల మహిళల్లో ఆసక్తి పెరిగిందని, ఎక్కువ మంది ఈకోర్సుల్లో చేరుతున్నారన్నారు. బ్యూటీషియన్లుగా రాణిస్తున్న వారు వృత్తి నైపుణ్యతలో మెళకువలను ఇతరలకు అందించాలన్నారు. వృత్తిలో ఉన్న పదిమందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్స్ విక్రమ్, మను గ్లోరి రమేష్, పి.సుగుణారెడ్డి, బ్యుటిషియన్లు ధనుశ్రీ, శారదా, సావిత్రి, సంధ్య, ప్రియాంక, మాధురి, వసంత, పార్వతి, సంతోషి, అను, సత్య, మంజు, సంతోషితోపాటు టెక్నిషియన్ నెజిమ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమంలో ఉత్తేజం నింపిన వందేమాతరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపించి ప్రజల్లో సాహిత్య స్ఫూర్తిని నింపిన వందేమాతరం గేయం రచించిన బంకించంద్ర ఛటోపాధ్యాయ స్ఫూర్తి ప్రధాతని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం నగరంలోని గాంధీ మందిరంలో బంకించంద్ర జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ నిక్కు అప్పన్నతో పాటు పలువురు హాజరై ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కాలంలో ప్రతి భారతీయునిలో దేశభక్తిని నింపి కార్యోన్ముఖులను చేసేందుకు వందేమాతరం గేయం నినాదంగా ముందుకు సాగిందన్నారు. నేటికీ ఆ గీతం ప్రజల్లో ఉత్తేజాన్ని నింపుతుందన్నారు. బంకించంద్ర ఛటోపాధ్యాయ రచించిన ఆనందమఠం అనే కావ్యంలోంచి

అంజలి ఘటిస్తున్న గాంధీమందిరం నిర్వాహకులు

వందేమాతరం గేయాన్ని నాటి ఉద్యమానికి స్ఫూర్తిగా అందరూ ఆల పించారన్నారు. ఈ కార్యక్రమంలో పైడి హరనాధరావు, జామి భీమశంకర్, సురంగి మోహనరావు, బరాటం లక్ష్మణరావు, మెట్ట అనంతం భట్లు, పందిరి అప్పారావు, మహిబుల్లాఖాన్, కొంక్యాన వేణుగోపాల్, నిక్కు హరిసత్యనారాయణ, గుత్తు చిన్నారావు, శాస్త్రి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

రోగులను పరీక్షిస్తున్న శశిధర్

కవిటి: వాతావరణంలో మార్పులు, పరిసర ప్రాంతాల ప్రభావంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాజపురం పిహెచ్‌సి వైద్యాధికారి శశిధర్ అన్నారు. మండలం భైరిపురంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరిశీలించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల కొంతమంది వైరల్ జ్వరాలతో బాధ పడుతున్నట్టు తెలిసి గత మూడు రోజులుగా వైద్యసేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో జ్వరాల తీవ్రత పెద్దగా లేదని, కొంతమంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నట్టు గుర్తించామన్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వాతావరణం మార్పులకు అనుగుణంగా ఆహార నియమాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. శిబిరంలో ఎంపిహెచ్‌ఒ అభిమన్యు సోయి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌పై సన్‌లైట్ చిత్రీకరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం, మండపల్లికి చెందిన పాతిర్ల సర్వన్ ఇచ్ఛాపురం రవీంద్రభారతి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. తండ్రి మాజీ సైనికోద్యోగి. సర్వన్ మొదటి నుంచి కళలపై ఆసక్తి ఎక్కువ. ఈ క్రమంలోనే ఎపి డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్‌పై వున్న ఎనలేని అభిమానంతో 4 రోజులు పాటు మండుటెండలో శ్రమించి సన్‌లైట్ ఆర్ట్‌ను చిత్రికరించినట్లు తెలిపారు. ఈ సన్ లైట్‌ఆర్ట్‌ను నియోజకవర్గ జనసేన సమన్వయకర్త దాసరి రాజుకు జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి అందజేశారు.

ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సర్వన్ పలు వురుకి ఆదర్శ ప్రాయమని అన్నారు. సర్వన్‌కు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రొక్కల భాష్కర్, శేఖర్, దంగుభాస్కర్, నాగరాజు, రుక్మేద్ర కాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు డాక్యుమెంటేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయం శక్తి సంఘాలకు గ్రామ సంఘాల ద్వారా మంజూరు చేస్తున్న అన్ని రకాల రుణాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్‌తో సహా సరైన డాక్యుమెంటేషన్ ఉండేటట్లు చూడాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ పి.రవికుమార్ సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ సంఘాల ద్వారా అందిస్తున్న సి.ఐ.ఎఫ్. రుణాలకు శ్రీనిధి, ఉన్నతి రుణాలకు సభ్యురాలు వారి, సంఘం వివరాలతో డాక్యుమెంటేషన్ తయారుచేసి మండల సమాఖ్యలో భద్రపరచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం పైడి కూర్మారావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, లీగల్ కోఆర్డినేటర్ జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్వర్ణరేఖ

మహిళల్లో అవగాహన అవసరం

టెక్కలి: సమాజంలో మహిళల పాత్ర చాలా కీలకమైందని విశాఖపట్టణానికి చెందిన గైనకాలజిస్టు డాక్టర్ స్వర్ణరేఖ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ఎన్‌పవర్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో అనేకమైన సమస్యలు వస్తుంటాయని, శారీరక, మానసికంగా భావించే సమస్యలు అధికంగా ఉంటాయన్నారు. వీటిని ఎదుర్కోనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ మాట్లాడుతూ సమస్యలను అవగాహన చేసుకుని ఆలోచిస్తే సరైన నిర్ణయం తీసుకోవచ్చునన్నారు. ఈ సదస్సులో మహిళా ఎన్‌పవర్‌మెంట్ కోఆర్డినేటర్ శ్రీధర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పరిసరాలు పరిశ్రుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని కె.కొత్తూరు వైద్యాధికారి శిష్టు గాయత్రి అన్నారు. బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు చెత్తబండి వస్తుందని తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా చెత్త బండికి ఇవ్వాలని సూచించారు. అలాగే వ్యాధుల సీజన్ కావడంతో వేడినీరు తాగాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.చందర్రావు, విఆర్‌ఒ మెట్ట జనక మోహనరావు, ఎఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: పశువులకు వర్షాకాలంలో ఎక్కువగా వ్యాప్తిచెందే గొంతు, జబ్బవాపు వ్యాధికి పాడి రైతులు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఊడికలపాడు, సాలిపేటలో 213 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో తిలారు పశువైద్యాధికారి డాక్టర్ ఎం.ప్రజ్ఞచైతన్య, జె.వి.ఒ లక్ష్మి, నరసమ్మ, ఎస్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి- పొందూరు

మండలం కొంచాడ పంచాయతీ లుట్టపేటలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో బాధితుడైన జనసేనాని కండ కామేశ్వరరావు కుటుంబసభ్యులను బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని హామీ ఇచ్చి వారికి నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు కొంచాడ సూర్య, పొన్నాడ బాలకృష్ణ, కోరాడ రాజు, దినేష్, దుర్గాప్రసాద్, చిన్నారావు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.